సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ధనలత

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు,కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యురాలు మళ్ల ధనలత బుధవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలను అధినేత దృష్టికి తీసుకెళ్లారు.

చంద్రమౌళీశ్వర ఆలయంలో అన్నదానం



అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: గోపాలపట్నం చంద్రమౌళీశ్వర ఆలయంలో కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడలు



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ చెప్పారు. వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతమైన లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో రూ. 19.52 లక్షలతో రక్షణ గోడ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. దీన్ని సకాలంలో పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలని కార్పొరేటర్ రమణ సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

దివ్యశ్రీకి అభినందన



దివ్యశ్రీని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి తదితరులు

మల్కాపురం: మహారాష్ట్రలో ఇటీవల జరిగిన పూర్వ గణతంత్ర శిబిరంలో మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థి దివ్యశ్రీ పాల్గొని సత్తా చాటి మెడల్ అందుకుంది. శిబిరం అనంతరం బుధవారం దివ్యశ్రీ కళాశాలకు రావడంతో ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి,జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి తదితరులు అభినందించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల నిరసన

దాబాగార్డెన్స్: బీఎస్‌ఎన్‌ఎల్ ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు బుధవారం దాబాగార్డెన్స్‌లో గల సంస్థ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వేతన సవరణ, పెన్షన్ సవరణ తక్షణమే పరిష్కరించాలని బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ, 5జీ సేవలు త్వరితగతిన ప్రారంభించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఈపీఎఫ్ వర్తింపజేయాలని కోరారు.


సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
✆ 8978872250

కాలుష్య పడగ!

శీతాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామాల ప్రజలకు ఒకటే కలవరం. మంచుతో పాటు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం గ్రామాన్ని చుట్టుముడుతుంది. దీంతో ప్రజలు కాలుష్యం బారిన పడి అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. కాలుష్యంతో సతమతమవుతున్నామని గ్రామస్తులు పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు గ్రామంలో పర్యటించి వెళ్లారే తప్పా.. కాలుష్య ప్రభావం ఉందో లేదో అని వెల్లడించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





ములగాడ గ్రామాన్ని ఆనుకుని ఉన్న పరిశ్రమ

- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు
- పీసీబీ అధికారులకు ఫిర్యాదు
- ములగాడ గ్రామంలో పర్యటించిన అధికారులు
- నివేదిక వెల్లడించకపోవడంతో ఆందోళనలో గ్రామస్తులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతంలో చిన్నములగాడ,ములగాడ విలేజ్ గ్రామాలు ఉన్నాయి.ఆ గ్రామాల్లో సుమారు 4 వేల మందికి పైగా జనం నివాసం ఉంటున్నారు. గ్రామాలకు సమీపంలో అలూఫ్లోరైడ్, కోరమాండల్ వంటి పరిశ్రమలతో పాటు ములగాడ విలేజ్‌కు చేరువలో శ్రావణి షిప్పింగ్ సంస్థ కూడా ఉంది. అయితే అలూఫ్లోరైడ్,కోరమాండల్ పరిశ్రమల నుంచి నిత్యం కాలుష్యం వెలువడుతుంది. అయితే మిగిలిన కాలాల్లో ఆయా పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల అంతగా సమస్య లేకున్నా శీతాకాలంలో మాత్రం సమస్య ఎక్కువగా ఉంటుంది. చలికాలంలో మంచుతో పాటు గాలి ప్రభావం అంతగా లేకపోవడంతో కాలుష్యం ఆ గ్రామాలను చుట్టుముడుతోంది.



ములగాడ గ్రామం వ్యూ

అనారోగ్యం పాలు

మంచు వల్ల పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ గాల్లో కలిసి గొంతు నొప్పి,కళ్ల మంటలు, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ధూళి మయం

ఈ సమస్య ఇలా ఉంటే ములగాడ గ్రామానికి చేరువలో ఉన్న శ్రావణి షిప్పింగ్‌కు నిత్యం వందల కొద్దీ కంటైనర్లు గ్రామం మీదుగా రాకపోకలు సాగించడంతో రోడ్డు ధ్వంసమై ధూళి కమ్మేస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓ పక్క కాలుష్యం,మరో పక్క ధూళితో సతమతమవుతున్నామని వాపోతున్నారు.

పాలకులు స్పందించాలి



గ్రామానికి సమీపాన అలూఫ్లోరైడ్, శ్రావణి షిప్పింగ్ వంటి సంస్థలు ఉన్నాయి.కోరమాండల్ పరిశ్రమ కాస్తా దూరంలో ఉంటుంది.ఆయా పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య సమస్యతో పాటు,శ్రావణి షిప్పింగ్‌కు వచ్చే కంటైనర్ల వల్ల విపరీతంగా ధూళి గ్రామాన్ని చుట్టేస్తుంది.దీంతో గ్రామస్తులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాం.సమస్యను పాలకులకు,అధికారులకు వివరించాం.అయినా నేటికీ స్పందన లేదు.

– బర్రి సూర్యప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు

సమస్య ఉందా.. లేదా?

కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల ఆ రెండు గ్రామాల ప్రతినిధులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. గతవారం అధికారులు చిన్నములగాడ, ములగాడ విలేజ్‌కు వచ్చి ఆర్.డి.ఎస్ మిషన్లు రాత్రి సమయాల్లో అమర్చి, మరుసటి రోజు వచ్చి వాటిని ల్యాబ్‌కు తరలించారు. రెండు గ్రామాలకు కాలుష్య సమస్య ఉందని అధికారులు చెబుతున్నారని.. ప్రభావం ఎంత.. దాని వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో చెప్పడం లేదని రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



కోరమాండల్,అలూఫ్లోరైడ్ వంటి పరిశ్రమల వల్ల చిన్న ములగాడ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.శీతాకాలం వచ్చిందంటే ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. సమస్యపై కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులకు అనేక మార్లు ఫిర్యాదు చేశాం. వారు రావడం కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలను చెప్పడం లేదు. మా బాధలు అధికారులకు పట్టవా..!.

–నర్సింగరావు, చిన్నములగాడ గ్రామ అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయిచరణ్ (ఫైల్)



ఘటనా స్థలంలో సాయిచరణ్ మృతదేహం

మల్కాపురం: లోను రికవరీ చేయడానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 58వ వార్డు కోరమాండల్ సమీపంలోని అజంతా కాలనీలో బసవ కృష్ణ భార్య,ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కృష్ణ పెద్ద కుమారుడు సాయిచరణ్ కొత్తగాజువాక వద్ద ఐడీఎఫ్‌సీ సంస్థలో రుణాలు మంజూరు, రికవరీ విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం రాత్రి నగరంలో ఓ వ్యక్తి వద్దకు లోను రికవరీ కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా శ్రావణి షిప్పింగ్‌కు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో సాయిచరణ్‌కు ఛాతీ,తలపై తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదిగి వచ్చిన కొడుకు ఇంతలోనే మృతి చెందాడని తండ్రి కృష్ణ బోరున విలపిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మృతదేహం కోరమాండల్ వద్ద శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో సరదాగా ఉండే సాయి ఇలా మృతి చెందడం చాలా బాధగా ఉందని గ్రామస్తులు విలపించారు. కేసును గాజువాక ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యం నరకం

ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు



గోపాలపట్నం నుంచి ఎన్ఏడీకి వచ్చే దారిలో నిలిపిన వాహనాలు

విశాఖ విద్య: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద దారుల్లో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వైపు వచ్చే బీఆర్‌టీఎస్ రోడ్‌లో ఫ్లై ఓవర్ వద్ద గల దుకాణాల ముందు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ సెంటర్‌కు వచ్చే దారిలో ఫ్లై ఓవర్ వద్ద ఉన్న హోటళ్లు, మద్యం దుకాణాలు, ఇతర వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వాటి వద్ద వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు లేకపోవడంతో రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. దీని వల్ల అటుగా వచ్చే వాహనాలు వీటిని తప్పించుకొని ముందుకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోంది. ప్రతీ రోజూ ఇక్కడ ఇదే తంతు ఉంటుందని.. ట్రాఫిక్ పోలీసులు ఎందుకు పట్టించుకోరని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. దుకాణాల ముందు వాహనాలు నిలపకుండా పార్కింగ్ స్థలాన్ని కేటాయిస్తే సమస్య ఉండదని, ఆ దిశగా పోలీసులు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో బుధవారం ప్రభుత్వ గృహాలకు చెందిన సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ పనులను కార్పొరేటర్ నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గృహాల నివాసితుల అభ్యర్థన మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి సెప్టిక్ ట్యాంకులను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. వాటర్ సప్‌లై ఏఈ సుమన్, యూజీడీ ఏఈ వాసుదేవన్, వాటర్ సప్‌లై వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రామరాజు పర్యవేక్షణలో సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

సింధియా: భారత రక్షణ మంత్రిత్వ శాఖ సూచనల మేరకు నావికాదళ పరిధిలోని పెన్షనర్లు, వారి కుటుంబ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి స్పర్శ్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ అబ్దుల్ హఫీజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం సింధియారోడ్‌లోని నేవల్ బేస్ సముద్రిక ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఈ కార్యక్రమానికి హాజరై జీవిత ధృవీకరణ పత్రాన్ని డిజిటల్‌గా పూర్తి చేసుకోవాలని కోరారు. పెన్షనర్లు స్పర్శ్‌కు సంబంధించిన ఫిర్యాదులను వేదిక వద్ద నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పెన్షనర్ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, పీపీవో కాపీ, బ్యాంక్ పాస్‌బుక్, మొబైల్ ఫోన్‌లను వెంట తీసుకురావాలని కోరారు.

నిర్దేశిత వయసులో వివాహం శ్రేయస్కరం



బ్రోచర్ విడుదల చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకట శేషమ్మ, అధికారులు

విశాఖలీగల్: చట్టబద్ధమైన వివాహ వయసు వచ్చిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ ప్రాంగణంలో బాల్య వివాహ ముక్తి భారత్ అనే అంశంపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ప్రసంగించారు. బాలికలకు 18, యువకులకు 21 ఏళ్ల వచ్చిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని నిర్దేశించారు. పోక్సో చట్టం, బాల్య వివాహ నియంత్రణ చట్టం, బాలల స్నేహ పూర్వక పథకం బాలల సంరక్షణ చట్టం 2015, వరకట్న నివారణ చట్టం, సెక్షన్ 498 ఏ వంటి అంశాలను వివరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జి.జయదేవి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల చట్టాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంటు ఆఫీసర్ ఎస్.కె.బేగం, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఇమ్యూనిటీ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, చైల్డ్ డెవలప్‌మెంటు ప్రాజెక్టు అధికారులు, కోఆర్డినేటర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పర్యవేక్షణ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న వారితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: బాల్య వివాహాలు చట్టవిరుద్ధం.. ఎవరు ప్రోత్సహించినా శిక్షకు గురవుతారని 59వ వార్డు నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. నక్కవానిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సురేష్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేర బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. చిన్నతనంలో బాలికలకు వివాహాలు చేస్తే వారు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్జీ పాలిమర్స్‌పై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమ?

దాబాగార్డెన్స్: విశాఖలో ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరిన్ గ్యాస్ లీకై 15 మంది చనిపోయారు. ఇప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నష్టపరిహారం ముగ్గురికి అందలేదు. అయినా తాజాగా తిరుపతి శ్రీసిటీలో ఎల్జీ పాలిమర్స్ సంస్థకు 188 ఎకరాలు ఏపీఐఐసీ ద్వారా భూసేకరణ చేసి ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఏంటో అర్థం కావడం లేదని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పేర్కొన్నారు. ఆ పరిశ్రమ ఏర్పాటుకు స్టాంప్ అండ్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీ మినహాయింపు ఇవ్వడం, రాష్ట్ర జీఎస్టీని మినహాయించడం, 20 ఏళ్ల పాటు విద్యుత్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వడం, ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులన్నీ వెను వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. 15 మంది ప్రాణాలు బలి తీసుకుని, అనేక మందిని క్షతగాత్రులను చేసిన ఎల్జీ యాజమాన్యంపై ప్రభుత్వానికి అంత ప్రేమ ఎందుకో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే ఎల్జీ పాలిమర్స్ పరిశ్రమకి శ్రీసిటీలో ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, విశాఖలో ఉన్న ఎల్జీ పాలిమర్స్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని సిటు డిమాండ్ చేస్తోందన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న మళ్ల



విజయప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గౌరీ పరమేశ్వరులను బుధవారం మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మళ్ల విజయప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 60 వార్డు కార్పొరేటర్ పి.వి సురేష్, బాకి శ్యామ్ కుమార్ రెడ్డి,జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్ కుమార్, నాయకులు మళ్ల శివ,దొడ్డి సతీష్, కొండపు సత్తిబాబు, ఎస్టీడీ చిన్ని,గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు దొడ్డి జగన్, ప్రధాన కార్యదర్శి తనకాల మోహన్, యూత్ అధ్యక్షులు దొడ్డి కన్నా, సంఘం పెద్దలు శరగడం మహాలక్ష్మి నాయుడు, దొడ్డి రామచంద్రరావు, మళ్ల రామ్ సురేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు,కార్యకర్తలు

మల్కాపురం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ. ఐదు లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం 59వ వార్డులోని నక్కవానిపాలెం సచివాలయం వద్ద ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కాండ్రేంగుల సత్యాంజనేయ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిని పేద వాడి తల రాత మాత్రం మారడం లేదన్నారు. పట్టణ పరిధిలో పేదలు ఇళ్ల అద్దె చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం మూడు సెంట్ల భూమి,నిర్మాణం కోసం సాయం అందిస్తే వారు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు,గండి అప్పారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవి సమ్మేళనానికి హాజరైన అతిథులు

మహారాణిపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో టర్నర్ చౌల్ట్రీ దగ్గర విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో జరిగిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. వైవిధ్యభరితమైన కవితలతో కవులు చక్కటి కవితలు చదివి వినిపించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వంలో వస్తువు, అలంకారం కావ్య సౌందర్యానికి శోభను కలుగజేస్తాయన్నారు. కవిత్వంలో భాష, భావంతో పాటు అలంకారం కూడా ముఖ్యం అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ కవులు సామాజిక కార్యకర్తలుగా సమాజ సౌభాగ్యానికి కృషి చేయాలన్నారు. కవిత్వం భావస్ఫూరకంగా ఉండాలని తెలిపారు. విశిష్ట అతిథి, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, కార్యదర్శి సీహెచ్ చిన సూర్యనారాయణ, విజయ నిర్మాణ్ సంస్థల అధినేత సూరపనేని విజయకుమార్, విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన నిర్వాహకుడు రాజు, భాగవతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ జి.కె. సుబ్రహ్మణ్యం, కె.వి.ఎస్ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, రాధారాణి, కె.ఎస్.వి. రమణమ్మ, కొత్తూరు రమణ, తనికెళ్ల సూర్యకళ, సూర్యకుమారి, రామతాత, వి. అనంతరాం, పి.వి.ఆర్. కుమారరావు, డాక్టర్ బంజి సత్యనారాయణ, మావుళ్లయ్య, డి.ఎస్. కుమార్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకపోతే వేటు

- జనవరి 1నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం
- అనధికార నిర్మాణాలపై అధిక ఫిర్యాదులు
- ప్లానింగ్ సెక్రటరీల పనితీరు బాగాలేదు
- వార్డు కార్యదర్శుల అలసత్వం సహించను
- జోన్–8 సమీక్షలో జీవీఎంసీ కమిషనర్



సమీక్షలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్





పాల్గొన్న జీవీఎంసీ అధికారులు, జోన్–8 అధికారులు, వార్డు కార్యదర్శులు

సింహాచలం: జీవీఎంసీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, నగరాభివృద్ధిలో కీలక బాధ్యత జోనల్ అధికారులదేనని, విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదని జీవీఎంసీ కమిషనర్ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ హెచ్చరించారు. సింహాచలంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో బుధవారం జీవీఎంసీ జోన్–8 అభివృద్ధి, ప్రజల సమస్యలపై జోనల్‌స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జోనల్ స్థాయి సమస్యలు, అభివృద్ధి పనులను జెడ్సీ హైమావతి, విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషనర్‌కి వివరించారు.

సమన్వయంతో పనిచేయండి

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు జోన్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, నూతన పనుల ప్రతిపాదనలపై సమన్వయంతో పనిచేయాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు, మౌలిక వసతుల కల్పన ప్రాధాన్యతాంశాలన్నారు. గ్రావెల్ రోడ్లు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మేరకు తారు రోడ్లను వేయాలన్నారు. వర్షాలకు గెడ్డలు పొంగిపొర్లకుండా పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. జోన్ పరిధిలో ఉన్న 26 పార్కులు, 26 శ్మశాన వాటికలను వీలైనంత తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేయాలన్నారు. అన్ని సామాజిక భవనాలు వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధిలైట్లు శతశాతం వెలగాలన్నారు.

ప్లానింగ్ విభాగంపై అసంతృప్తి

టౌన్ ప్లానింగ్ విభాగంపై జరిగిన సమీక్షలో కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణలు, అనధికార కట్టడాలపై పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ప్లానింగ్ సెక్రటరీల పనితీరు బాగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. జీవీఎంసీ నుంచి బిల్డింగ్ ప్లాన్‌ని సులభంగా పొందవచ్చన్న విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కోర్టు ధిక్కరణ, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నందున సీఎం పేషీ నుంచి వివరణ కోరుతున్నారని తెలిపారు. అక్రమ, అనధికార నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను అరికట్టాలన్నారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం

యూసీడీ విభాగం ద్వారా వెల్ఫేర్ కార్యదర్శులు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు, బ్యాంకు లోన్లు తదితర విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 తర్వాత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని, దీనిపై 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచి శత శాతం వ్యర్థాలు సేకరించి డస్ట్‌బిన్ ఫ్రీ సిటీగా విశాఖ నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికను శానిటరీ సెక్రటరీ రూపొందించుకోవాలని సూచించారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఈ పి.శివప్రసాదరాజు, సీసీపీ ఎ.ప్రభాకరరావు, డీసీఆర్ ఎస్.శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీర్ రామ్మోహనరావు, టౌన్‌ప్లానింగ్ సీపీ మీనాకుమారి, డీసీపీ రామ్మోహన్, యూసీడీ ప్రాజెక్టు అధికారి బి.రమణమ్మ, కార్యనిర్వాహక ఇంజినీర్లు చిరంజీవి, శ్రీధర్, సహాయ వైద్యాధికారులు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ అప్పలనాయుడు, ఏపీడీ చిరంజీవి, ఏసీపీ రామలింగేశ్వర రెడ్డి, ఆర్ఐలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.